
హెల్త్‌సిటీలో రోగుల సేవలకు దూరంగా కొన్ని ఆస్పత్రులు

ఏపీఐఐసీ ద్వారా అతి తక్కువ ధరకు స్థలాలు దక్కించుకుని మిన్నకున్న వైనం

మహానేత వైఎస్సార్ ఆశయానికి తూట్లు

వైద్య సేవలు నిల్





పలు ఆస్పత్రుల సమాహారంగా ఉన్న హెల్త్‌సిటీ

ఆరిలోవ: స్థానిక పెదగదిలి నుంచి చినగదిలి, దీన్ దయాల్‌పురం వరకు ఉన్న హెల్త్‌సిటీలో ఏళ్లు గడుస్తున్నా కొన్ని ఆస్పత్రులు వైద్య సేవలు అందించడంలేదు. ప్రభుత్వం ద్వారా స్థలాలు సొంతం చేసుకోవడానికి చూపిన ఉత్సాహం వైద్య సేవలు అందించడంలో కనబరచడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు 16 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి అన్ని విభాగాల వైద్య సేవలు ఒకే చోట రోగులకు అందుబాటులో ఉండాలని హెల్త్ సిటీ పేరుతో పశు సంవర్ధక శాఖకు చెందిన సుమారు 200 ఎకరాల స్థలాన్ని ఆస్పత్రుల కోసం కేటాయించారు. ఈ స్థలాలు ఏపీఐఐసీ ద్వారా అందించారు. దీని ప్రకారం అప్పట్లో 28 మంది వైద్యులు ముందుకు రావడంతో వారికి స్థలాలు కేటాయించారు. ఆ స్థలాలు పొందిన వారు నిబంధనలు, సూచనల ప్రకారం వెంటనే ఆస్పత్రులు నిర్మించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని అప్పట్లోనే ఏపీఐఐసీ అధికారులు ఆదేశించారు. ఆ నిబంధనల ప్రకారం ఆస్పత్రులు నిర్మించి కొందరు మాత్రమే సేవలు అందిస్తున్నారు. మరి కొందరు వైద్యులు స్థలాలు సొంతం చేసుకుని సేవలకు దూరంగా ఉన్నారు.

రూ.లక్షల్లో ఎకరం స్థలం..

ప్రారంభంలో 28 ఆస్పత్రుల నిర్మాణానికి ఏపీఐఐసీ ఇక్కడ స్థలాలను అప్పట్లో అతి తక్కువ ధరకు కేటాయించింది. అప్పట్లో రూ.లక్షల్లో ఏపీఐఐసీ నుంచి కొనుగోలు చేసిన ఆయా స్థలాల విలువ ప్రస్తుతం రూ.కోట్లకు పెరిగింది. అందుకే కొందరు ఆ స్థలాలను కాపాడుకుని వైద్యం పక్కన పెట్టేశారు. హెల్త్‌సిటీలో క్యూ1, పినాకిల్, శుశ్రుత, ఎంటీ, జీజే, రెయిన్‌బో, విజయ్ మెడికల్స్, మెడికవర్ (పాత ఏబీసీ) యునిక్, వర్మ, ఒమేగాతో పాటు మరికొన్ని ఆస్పత్రులు, ఓ హోటల్, సర్జికల్ మెడికల్స్ మాత్రమే హెల్త్‌సిటీలో సేవలు అందిస్తున్నాయి. ఇక్కడ రెండు ఆస్పత్రులు నిర్మాణం జరిగి మూడేళ్లు గడిచినా సేవలు అందించడం లేదు. మరో ఆరు ఆస్పత్రులు నిర్మాణంలో ఉన్నాయి. హెల్త్‌సిటీలో ఆస్పత్రుల నిర్మాణం కోసం 2008లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి మూడు నాలుగు సంవత్సరాలలో స్థలాలు పొందిన వారంతా నిబంధనల ప్రకారం ఆస్పత్రులు నిర్మించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అయినా ఒకటిన్నర దశాబ్దాలు గడిచినా ఇంత వరకు ఇక్కడ అన్ని ఆస్పత్రులు సేవలు అందించడంలేదు. స్థలాలు మాత్రం పొంది సేవలకు దూరంగా ఉన్నాయి.

ఈ ఆస్పత్రుల తీరు వేరు..

ఇక్కడ మరో రెండు ఆస్పత్రుల తీరే వేరు. జిమ్స్, ఎల్ఎల్‌పీ (వెల్‌కమ్) ఆస్పత్రులు నిర్మాణం జరిగి ఏళ్లు గడిచినా నిరుపయోగంగానే ఉన్నాయి. ఇక్కడ గొలగాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (జిమ్స్) పేరుతో ఓ వైద్యుడు సుమారు ఎకరం స్థలం ఏపీఐఐసీ నుంచి తీసుకుని ఆస్పత్రి నిర్మించి వదిలేశారు. కొన్నాళ్లు దీన్ని నిర్వాహకుడు ఈఎస్ఐకి అద్దెకు ఇచ్చుకున్నారు. రెండేళ్ల క్రితం ఈఎస్ఐ అధికారులు కూడా దీన్ని ఖాళీ చేసేశారు. ప్రస్తుతం ఇది సేవలు అందించకుండా నిరుపయోగంగా ఉంది. దీని పక్కనే ఎల్ఎల్‌పీ ఆస్పత్రి నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడిచింది. ఇంత వరకు దీన్ని ప్రారంభించి సేవలు అందించకుండా నిరుపయోగంగా వదిలేశారు.



సేవలందించని జిమ్స్ ఆస్పత్రి



నిరుపయోగంగా ఉన్న ఎల్ఎల్‌పీ (వెల్‌కం) ఆస్పత్రి



ఏడేళ్లుగా నిర్మాణం సాగిస్తున్న ఆస్పత్రులు

క్లుప్తంగా

నీతి ఆయోగ్ సీఈవోకి సత్కారం



నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యంకు జ్ఞాపిక అందజేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్

విశాఖ సిటీ : నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యంను వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నీతి ఆయోగ్ గ్రోత్ ఇంజెన్స్‌పై గత మూడు రోజులుగా వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ శనివారం కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమసదన్‌లో రంగోలీ పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థిని

ఎంవీపీకాలనీ: సెక్టార్–8లోని శ్రీ సత్యసాయి ప్రేమసదన్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయం ఉట్టిపడేలా విద్యార్థులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా బాల వికాస్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులు, గురువులకు రంగోలీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వారంతా ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష హారతులు



నక్షత్ర హారతి వెలుగుల్లో వేంకటేశ్వరుడు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం 28వ పాసురం సందర్భంగా కూడారై ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వెంకన్నకు ఏకహారతి, పంచహారతులు, నక్షత్ర హారతి, కుంభ హారతులు వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా దేవస్థానం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆదివారం గోదాదేవిని పెళ్లి కూతురును చేయడం, పసుపు దంచు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీపీ రమాబాయి తెలిపారు.

వేంకటేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఆరిలోవ: ఆరిలోవలోని ఆపరేషన్ కాలనీ శివాలయం ఆవరణలో కొందరు స్థానిక నాయకులు వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి సెట్ ఏర్పాటు చేశారు. ఆ సెట్‌లో స్వామిని ఏర్పాటు చేసి అలంకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం నుంచి స్వామికి పూజలు చేస్తున్నారు. సెట్ నిర్వాహకుల ఆహ్వానంతో దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు, నిర్వాహకులు ఆయనకు సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు.

వికసించిన ఆర్చిడ్ పూలు



కనువిందు చేస్తున్న ఆర్చిడ్ పూలు

బీచ్‌రోడ్డు: తూర్పు కనుమల అడవుల్లో అరుదుగా లభించే ఆర్చిడ్ పూలు పెదవాల్తేరులోని బయోడైవర్సిటీలో వికసించాయి. రైన్‌కోస్టిలిస్ కోలెస్టిస్ అల్బా పేరుతో పిలిచే ఈ పూలు చూడటానికి అద్భుతంగా ఉంటాయి. పార్క్‌కు వచ్చిన సందర్శకులను ఈ పూలు ఆకర్షిస్తున్నాయని పార్క్ నిర్వాహకుడు రామమూర్తి తెలిపారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాత



జాలరిపేట తీరంలో మృత్యువాత పడ్డ ఆలీవ్ రిడ్లే తాబేళ్లు


ఎంవీపీకాలనీ: పెద జాలరిపేట తీరంలో ఆలీవ్ రిడ్లే తాబేళ్లు పెద్ద ఎత్తున మృత్యువాత పడ్డాయి. ఏటా శీతాకాలంలో ఈ తాబేళ్లు వేల కిలోమీటర్లు ప్రయాణించి గుడ్లు పెటేందుకు తూర్పు తీరానికి వస్తాయన్న విషయం తెలిసిందే. అయితే ఇలా వచ్చే వేల తాబేళ్లలో ఎన్నో విశాఖ తీరంలో పెద్ద ఎత్తున మృత్యువాత పడుతున్నాయి. ప్రస్తుతం అప్పుఘర్, పెద జాలరిపేట తీరంలో వీటి కళేబరాలు దర్శనమిస్తున్నాయి. వేటగాళ్ల వలలల్లో పడటం వల్ల చాలా తాబేళ్లు మృత్యువాత పడటంతో పాటు కెరటాల తాకిడికి తీరంలోని బండరాళ్లకు గుద్దుకుని మృతి చెందుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అత్యంత అరుదైన ఈ తాబేళ్లు మృత్యువాత పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు, జంతు ప్రేమికులు కోరుతున్నారు.

వినోదానికి వేదికగా విశాఖ

• ఘనంగా విశాఖ ఎక్స్‌పో 2025 ప్రారంభం



కాశ్మీర్ నగరం నమూనా



ఎక్స్‌పో వేదిక వద్ద ఎమ్మెల్సీ చిరంజీవి రావు తదితరులు

ఏయూక్యాంపస్: వినోదానికి వేదికగా విశాఖ నగరం నిలుస్తుందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు అన్నారు. శనివారం సాయంత్రం బీచ్‌రోడ్డులో పోలీస్ మెస్ వెనుక ఏర్పాటు చేసిన విశాఖ ఎక్స్ పోను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కుటుంబమంతటికీ, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచే వేదికగా విశాఖ ఎక్స్ పో నిలుస్తుందన్నారు. సంక్రాంతి పండగను విశాఖ వాసులు ఆనందంగా జరుపుకునే వేదికగా ఇది ఉందన్నారు. కొండపల్లి బొమ్మలను పోలిన విధంగా తీర్చిదిద్దిన ప్రవేశద్వారం పండగ వాతావరణాన్ని తీసుకు వచ్చిందన్నారు. వైవిధ్యమైన ఆట వస్తువులు, జలకన్యలు విశాఖకు కొత్త అందాన్ని, ప్రత్యేకతను తీసుకువస్తాయన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరినీ అలరిస్తుందన్నారు. కాశ్మీర్ నగర నమూనా ఎంతో సహజంగా నిలుస్తోందని, కాశ్మీర్ వెళ్లిన అనుభూతి ప్రజలకు కలుగుతుందన్నారు. విశాఖ ఎక్స్ పో నిర్వాహకులు రాజారెడ్డి మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా విశాఖ వాసులను సరికొత్త ఆకర్షణలతో ఆకట్టుకునే విధంగా వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైవిధ్యమైన ఎంటర్‌టైన్‌మెంట్, ఎమ్యూజ్‌మెంట్ రైడ్స్ ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండే ధరల్లో ప్రవేశ రుసుము ఉంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చోడె వెంకట పట్టాభిరామ్, బైరెడ్డి పోతన్నరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న టూరిజం ఎగ్జిబిషన్




హస్త కళా వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు



నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

ఏయూ క్యాంపస్ : బీచ్‌రోడ్డులోని పాండురంగాపురం వద్ద ఏర్పాటు చేసిన టూరిజం ఎగ్జిబిషన్ నగరవాసులను ఆకట్టుకుంటోంది. విశాఖపట్నం ట్రావెల్ మార్ట్ – 2025 పేరుతో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఆదివారం కూడా ఈ ప్రదర్శన కొనసాగుతుంది. ఏపీ, ఛత్తీస్‌ఘడ్, సిక్కిం తదితర రాష్ట్రాలకు చెందిన పర్యాటక శాఖల స్టాల్స్ ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఆయా రాష్ట్రాలలో పర్యాటక, సందర్శనీయ స్థలాల వివరాలు తెలియజేసే కరపత్రాలు, పోస్టర్లతో ప్రజలకు వివరిస్తూ వారిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. అదే విధంగా వివిధ టూర్స్ – ట్రావెల్స్ నిర్వాహకులు తమ ప్రత్యేక ప్యాకేజీలు వివరిస్తూ ప్రజలకు చేరువయ్యారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన వేదికపై వివిధ జానపద నృత్యాలు ప్రదర్శించారు. హస్త కళా ఉత్పత్తుల స్టాల్స్‌లో, గోమయ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన వస్తువుల స్టాల్స్‌లో ఆసక్తిగా నగరవాసులు, పర్యాటకులు కొనుగోళ్లు జరిపారు. సాయంత్రం వేళ సాగరతీరానికి వచ్చిన పర్యాటకులు సైతం వీటిని ఆసక్తిగా తిలకించారు.

ఆదర్శమూర్తి మాస్టర్ ఈకే



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

మహారాణిపేట: మాస్టర్ ఈకే ఆదర్శనీయులని కులపతి బుక్ ట్రస్ట్ అధ్యక్షుడు సి.హెచ్.ఎస్.ఎన్. రాజు అన్నారు. జగద్గురు పీఠం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న 64వ మాస్టర్ సీవీవీ గురు పూజోత్సవాలలో భాగంగా శనివారం అంకోశ సమావేశ మందిరంలో జరిగిన మాస్టర్ ఈకే గ్రంథావిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. వందకు పైగా పుస్తకాలను మాస్టర్ ఈకే రచించారన్నారు. ఈకే ఐరోపా యాత్ర అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించగా లలితా సహస్ర నామ రహస్య ప్రకాశం అనే పుస్తకాన్ని కె. రాంప్రసాద్ (మచిలీపట్నం), బుక్ ఆఫ్ రిచువల్స్‌ను కె. రవీంద్రనాథ్ (బెంగళూరు),'తైత్తిరియోపనిషత్‌ను చింతలపాటి సత్యదేవ్ ఆవిష్కరించారు. సంస్థ కార్యదర్శి బి.ఆర్.కె. రాజు, ఉప్పలపాటి భూపాలవర్మ, పప్పు రవిశంకర్, ఎన్.వి.ఎస్. మూర్తి, కంచుపాటి జయకుమార్, ఎన్.వి. రమణకుమార్, పి. నీలిమ, గణపతి రాంప్రసాద్ జోషి, ఇంద్రగంటి కాశీప్రసాద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి కృషి

అల్లిపురం: ప్లాస్టిక్ నిషేధానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో 27 వేల సే నో ప్లాస్టిక్ స్టిక్కర్లు అంటించినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాలు, వ్యాపారులు, సచివాలయాల కార్యదర్శులు, జీవీఎంసీ సిబ్బంది విస్తృత ప్రచారం చేసినట్లు తెలిపారు. జూమ్ యాప్ ద్వారా అందరికీ అవగాహన కల్పించామన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు.

ఐఐఏఎంలో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



హరిదాసుకు కానుకలు సమర్పిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ : తెలుగు సాంప్రదాయాలను, సంస్కృతులను దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు పరిచయం చేస్తూ ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ (ఐఐఏఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాజీమా తాజ్ సంస్థ సీఈవో డాక్టర్ మీనాక్షి ముఖ్య అతిథిగా పాల్గొని భోగి మంటను వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతికి గ్రామీణ తెలుగు ప్రజల్లో ప్రత్యేక స్థానం ఉందన్నారు. కష్టించి పండించిన పంట చేతికి వచ్చిన అనంతరం కుటుంబ సమేతంగా, బంధుమిత్రుల సమేతంగా ఏటా ఈ పండగ జరుపుకోవడం సాంప్రదాయమన్నారు. ఈ సాంప్రదాయాన్ని భవితరాలకు అందించే దిశగా ఐఐఏఎం యాజమాన్యం వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సమతా కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయరవీంద్ర, ఐఐఏఎం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శివకుమార్, ఆచార్య సాయిబాబా, ఆచార్య మధుసూదనరావు, డాక్టర్ దీపిక పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ తెలపాలని ఆందోళన



కళ్లకు నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న బాలిక కుటుంబ సభ్యులు

సీతమ్మధార: నిరుపేద కుటుంబానికి చెందిన బాలిక (16) డిసెంబర్ 19న అదృశ్యమైంది. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో జాప్యం జరగడంతో వారు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసి మరోసారి ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదును నాలుగో పట్టణ పోలీసులకు బదిలీ చేసి దర్యాప్తు వేగవంతం చేయమని చెప్పారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు హైదరాబాద్‌లో బాలిక మిత్రులు ఉన్నారని అనుమానిస్తూ విశాఖ నుంచి హైదరాబాద్‌కు బాలిక తల్లిదండ్రులను తీసుకెళ్లారు. ఇందుకు బాలిక తల్లిదండ్రులు రూ. 6 వేలు అప్పు చేసి వెళ్లారు. అయితే బాలిక ఆచూకీ లభ్యం కాక నిరాశతో వెనుదిరిగారు. కొన్ని రోజుల తర్వాత రాజమండ్రిలో బాలిక ఆచూకీ లభ్యమైందని అక్కడికి వెళ్లాలని పోలీసులు బాలిక తల్లిదండ్రులకు చెప్పారు. అయితే అక్కడికి వెళ్లేందుకు తమ వద్ద డబ్బు లేదని వారు తెలపడంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో తమ కుమార్తె ఆచూకీ వెంటనే కనుగొనాలని బాలిక తల్లి జి. పార్వతి కోరుతూ జీవీఎంసీ గాంధీ పార్కులో కుటుంబ సభ్యులతో కలిసి నోటికి నల్లరిబ్బన్లు ధరించి శనివారం నిరసన తెలిపారు. సీపీ ఆదేశాలతో అయినా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి తమ కుమార్తె ఆచూకీ కనుగొనాలని కోరారు. తాము తాటిచెట్లపాలెం లెప్రసీ కాలనీలో నివాసం ఉంటున్నామని తెలిపారు. నిరసనలో పార్వతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఊరెళ్తే జాగ్రత్తలు తప్పనిసరి



ఆరిలోవలో ఆటోకి పోస్టర్లు అంటించి ప్రచారం చేస్తున్న కానిస్టేబుల్



ఆటో డ్రైవర్లకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న కానిస్టేబుల్

• ప్రచారం చేస్తున్న పోలీసులు

ఆరిలోవ: సంక్రాంతికి ఊళ్లు వెళ్తున్న వారు జాగ్రతలు పాటించాలని ఆరిలోవ పోలీసులు ప్రచారం చేస్తున్నారు. కరపత్రాల పంపిణీ, పోస్టర్లు అంటించడం, ఆటోల ద్వారా ప్రచారం తదితర చర్యలు చేపడుతున్నారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో అటు రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్, హనుమంతవాక, డెయిరీఫారం ఇటు పైనాపిల్‌కాలనీ, ఆరిలోవ రవీంద్రనగర్‌తో పాటు హనుమంతవాక నుంచి దీన్‌దయాల్‌పురం వరకు కొండవాలులో శనివారం ప్రచారం చేపట్టారు. ఆటోలకు పోస్టర్లు అంటించి మైక్‌లలో కానిస్టేబుళ్లు హెచ్చరికలు చేశారు. మరి కొందరు కానిస్టేబుళ్లు ఇళ్లకు, కిరాణా షాపులు, ఆస్పత్రులు, వాహన చోదకులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆరిలోవ ప్రాంతం నుండి విజయనగరం, శ్రీకాకుళం, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వారు వేల మంది సంక్రాంతికి ఊళ్లు వెళ్తుండటంతో కాలనీ అంతా ఖాళీ అవుతోంది. దీంతో పోలీసులు ఈ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ముందుగా పోలీసులకు మాచారం ఇచ్చేవారి ఇళ్ల ప్రాంతంలో నిఘా పెంచుతామని ఆరిలోవ సీఐ తెలిపారు. బస్‌లు, రైలు ప్రయాణం చేసేటప్పుడు అపరిచితులు ఇచ్చే తినుబండారాలు తీసుకోకూడదని సూచించారు. ఇళ్లకు నాసిరకం తాళాలు వేయవద్దన్నారు. బంగారు ఆభరణాలు, నగదు తదితర విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలోను, లేదంటే సురక్షితమైన చోట భద్రపరుచుకోవాలన్నారు. ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, ఇంటి అడ్రస్ పోలీసులకు చెప్పడం, ఊరెళ్లిన తర్వాత చుట్టు పక్కల వారికి ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవడం చేయాలన్నారు.

ఏయూ కుస్తీ పోటీల జట్టు ఎంపిక



క్రీడాకారులతో ఆచార్య విజయ మోహన్ తదితరులు

విశాఖ విద్య : అల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మహిళల కుస్తీ పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఆడే జట్టును శనివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎస్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. ఈ నెల 14 నుంచి 19 వరకు మహిళల కుస్తీ పోటీలు గురు కాశీ యూనివర్సిటీలో జరుగుతాయన్నారు. చీపురుపల్లిలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ విద్యార్థినులు జి.దేవి, కుమారి సింగ్, వి.లావణ్య, ఎంఆర్ కాలేజ్ నుంచి కె.పి.డి.ప్రవల్లిక, సత్యారామ కాలేజీ నుంచి బి.సుభద్ర పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కుస్తీ పోటీల్లో ప్రతిభ సాధించి వర్సిటికి పేరు తీసుకురావాలని సూచించారు. ఏయూ వ్యాయామ విద్య విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి క్రీడాకారిణులను అభినందించారు. ఏయూ దూరవిద్యా కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దొరబాబు, కోచ్ బి.జ్యోతిక పాల్గొన్నారు.

సాహితీ సేవకు అంకితం

మురళీనగర్ : సాహితీ కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తూ సాహితీ సేవకు అంకితం చేద్దామని సాహితీ స్రవంతి సభ్యులు తీర్మానించారు. సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షుడు పాలమరశెట్టి ఫ్రాన్సిస్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అందరూ విజయం దిశగా సాగుదామని అధ్యక్షుడు ఫ్రాన్సిస్ అన్నారు. ఈ సందర్భంగా కవిత సమ్మేళనంలో రచయితలు ఆనంద్ శర్మ, కె.భాస్కరరావు, కె.ఎర్నికుమార్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ

మురళీనగర్ : మురళీనగర్ సుదర్శన్ పార్కులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా పలువురు కార్మికులకు నూతన వస్త్రాలు అందించారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధి ఎంఆర్‌కే రంగారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము పాల్గొని కార్మికులకు వస్త్రాలు అందించారు.